ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

● జనవరి 1 నుంచి అమలుకు సన్నాహాలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు భోజనం అందించగా, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రద్దు చేసింది. ఈ పథకం వల్ల దూరప్రాంతాల నుంచి కళాశాలలకు వచ్చే విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్న కూటమి ప్రభుత్వం వచ్చే నెల 1వ తేదీ నుంచి మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించింది. జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల 5,149మంది ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించనున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2906 మంది చదువుతుండగా బాలురు 1136, బాలికలు 1770 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరంలో 2243 మంది ఉండగా.. బాలురు 738, బాలికలు 1505 మంది ఉన్నారు. వీరి కోసం 2025 జనవరి 1 నుంచి మధ్యాహ్నం భోజనం అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

'బాదుడు'ను ప్రారంభించిన బాబు ప్రభుత్వం : తులసిరెడ్డి

వేంపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రజలపై బాదుడు కార్యక్రమం చంద్రబాబు ప్రభుత్వం ప్రారంభించిందని ఏపీసీసీ ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆరోపించారు. వేంపల్లెలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలను అనేక విధాలుగా బాదడం ప్రారంభించిందన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై రూ.15485 కోట్ల అదనపు భారం మోపిందన్నారు. జనవరి 1న గ్రామాలు, పట్టణాలు, నగరాలలో భూములు, నివాస, వాణిజ్య భవనాలు, అపార్ట్‌మెంట్లు, ప్లాట్లపై దాదాపు 20శాతం రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు భారం మోపబోతోందన్నారు. పట్టణాలు, నగరాలలో మంచినీటి సరఫరా మీద యూజర్ చార్జీల భారం త్వరలో మోపబోతోందన్నారు. 5శాతానికి మించి జీఎస్టీ స్లాబులో ఉన్న వస్తువుల రవాణాపై ఒకశాతం వరద సెస్ విధించాలని రాష్ట్ర ప్రభుత్వం నిన్న రాజస్థాన్‌లో జరిగిన జీఎస్టీ 55వ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించిందన్నారు. ఇది ప్రజా రంజక ప్రభుత్వం కాదు ప్రజా పీడిత ప్రభుత్వమని ధ్వజమెత్తారు. అలాగే రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి రామానాయుడు ఆదివారం గండికోట ప్రాజెక్టును సందర్శించడం హర్షనీ య న్నారు. అయితే గండికోట రిజర్వాయర్ కింద కొండాపురం, ముద్దనూరు మండలాల్లో 22 గ్రామాలు ముంపునకు గురయ్యాయని.. కొంతమందికి ఇంకా నష్టపరిహారం అందలేదని.. దీనిపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు.

భూసమస్యలకు చెక్



భూ సమస్యలపై ఇళ్లవద్దకు వెళ్లి బాధితులతో మాట్లాడుతున్న వీఆర్వోలు

● ఇంటింటికీ వీఆర్వోలు
● సోమవారం గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులపై..
● మరుసటి రోజే అర్జీదారుల వద్దకు
● సెల్ఫీ తీసుకుని అక్నాలెడ్జ్‌మెంటు ఇస్తున్న వైనం
● భూసమస్యల పరిష్కారానికి కలెక్టర్ సరికొత్త ప్రయోగం

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్లపాలనలో ఇష్టారాజ్యంగా భూకబ్జాలు జరిగాయి. ఎవరి భూమి ఎవరి పేరిట ఉందో తెలియదు. సాగులో ఒకరుంటే ఆన్‌లైన్‌లో మరొకరు ఉంటారు. వాస్తవంగా ఉన్నభూమికి రికార్డులలో ఉన్న విస్తీర్ణానికి ఎంతో తేడా వచ్చింది. ఈ సమస్యలన్నింటిపై కూటమి ప్రభుత్వం వచ్చాక ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుడుతోంది. అయితే కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మరో అడుగు ముందుకు వేశారు. జిల్లాలో సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఎలాగంటే రెవెన్యూ సదస్సులు జరిగే ముందురోజే వీఆర్వో ఆ గ్రామ రైతుల భూములకు సంబంధించిన 1బీలను డౌన్‌లోడ్ చేసుకుని ఇంటింటికీ వెళ్లి అందిస్తున్నారు. 1బీలో మీభూముల వివరాలు సక్రమంగా ఉన్నాయా.. పేర్లు సర్వేనెంబర్లు, హద్దులు విస్తీర్ణంలో ఏమైనా తేడాలు ఉన్నాయా అంటూ అడుగుతున్నారు. తేడాలుంటే రైతుల నుంచి దరఖాస్తు తీసుకుంటున్నారు. అన్నీ సరిపోయినా సరే రైతుల నుంచి అన్నీ సక్రమంగా ఉన్నట్లు దరఖాస్తు తీసుకుంటూ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం సాయంత్రం నాటికి సుమారు 2.50లక్షల 1బీలను డౌన్‌లోడ్ చేసి రైతులకు అందించి సంతకాలు తీసుకున్నారు. ఏమైనా తేడా ఉంటే వాటిని గడువులోపు పూర్తి చేస్తామని చెబుతున్నారు.

ఫిర్యాదులపై మరుసటి రోజే బాధితుల వద్దకు..

ఇక ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌లో వచ్చిన ఫిర్యాదులపై మరుసటిరోజే అంటే మంగళవారమే రెవెన్యూ అధికారులు ఫిర్యాదుదారుల ఇంటి వద్దకు వెళుతున్నారు. దీనిని జిల్లాలో కొత్తగా కలెక్టర్ అమలు చేస్తున్నారు. భూ సమస్యలున్నా, గ్రామాలకు సంబంధించిన సమస్యలున్నా, ఏదైనా గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు వస్తే మరుసటి దినమే వీఆర్వో, ఆర్ఐ, తహశీల్దారు స్థాయి అధికారులు ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లాలి. వెళ్లి ఫిర్యాదుదారులతో మాట్లాడి సెల్ఫీ ఫొటో తీసుకుని వాట్సప్ గ్రూపుల్లో పోస్టు చేయాలి. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. ఈ సోమవారం గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే ఆయా మండలాల తహశీల్దార్లకు పంపించారు. భూసమస్యలపై వచ్చిన ఫిర్యాదుల్లో బుధవారం నాటికి 94శాతం మంది రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లి కలిశారు. అయితే ఆరుగురు భూములున్న చోట కాకుండా వేరే ప్రాంతాల్లో నివాసం ఉండడంతో వారిని కలవలేకపోయారు. ఫోనులో మాట్లాడి వారి సమస్యను తెలుసుకున్నారు. 15రోజుల్లోపే సమస్య పరిష్కరించేలా ఒక రోడ్‌మ్యాప్ తయారు చేసుకుని రెవెన్యూ సిబ్బందిని రంగంలోకి దింపారు.

నిద్రమత్తు వీడుతున్న రెవెన్యూ..

జగన్ హయాంలో కలెక్టర్ స్పందన కార్యక్రమానికి ఫిర్యాదులు వస్తే కాల్‌సెంటరు ద్వారా మీ సమస్య పరిష్కారం అయిందా, లేదా అని అడిగి.. గడువులోపు అది పరిష్కారం కాకపోయినా పరిష్కారం అయినట్లు వారే డిక్లేర్ చేసేసేవారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో స్పందనకు నెలల తరబడి అదే ఫిర్యాదుదారులు వచ్చేవారు. దరఖాస్తుదారులను కలవకుండానే సమస్య పరిష్కారం అయినట్లు కింది స్థాయి రెవెన్యూ సిబ్బంది కూడా అలాగే చేసేవారు. ఈ బోగస్ విధానానికి చెక్ పెట్టేందుకు బాధితులను రెవెన్యూ సిబ్బంది కలిసి సెల్ఫీని వాట్సప్ గ్రూపుల్లో పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఇప్పటిదాకా నిద్రమత్తులో ఉన్న రెవెన్యూ యంత్రాంగం బాధితుల వద్దకు క్యూ కడుతున్నారు.

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి టైంబౌండ్ నిర్ణయించారు. వచ్చేనెల వరకు ఈ సదస్సులు జరుగుతూనే ఉంటాయి. ప్రభుత్వం ఆదేశించిన మేరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో పాటు కలెక్టర్ కూడా భూసమస్యల పరిష్కారానికి నడుం బిగించడంతో రెవెన్యూ సిబ్బంది అంతా ఫిర్యాదుదారుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా సరే.. అది మాకే వస్తుంది, మేమే పరిష్కరించాలి అని తిక్కతిక్కగా వ్యవహరించే రెవెన్యూ సిబ్బందికి కలెక్టర్ కీలు ఎరిగి వాత పెట్టినట్లుగా మారింది. తనదైన స్టైల్‌లో కలెక్టర్ చర్యలు చేపట్టడంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలకు చెక్ పడుతుందని జనం భావిస్తున్నారు.



శిశు ఆధార్ తప్పనిసరి

● ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి



ముఖాముఖి

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల ద్వారా సంక్షేమ పథకాలు పొందాలంటే శిశుఆధార్ కార్డు తప్పనిసరి అని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు అంగన్వాడీ కేంద్రాల వద్ద శిశు ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మొదటి విడత కింద 17, 18, 19వ తేదీలలో ఆధార్ నమోదు చేపట్టడం జరిగిందన్నారు. రెండో విడత కూడా త్వరలో చేపట్టనున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: ఎంత వయసు వారికి శిశు ఆధార్ నమోదు చేస్తున్నారు?
జవాబు: 0 నుంచి 6 ఏళ్లలోపు ఉన్న పిల్లలందరికి శిశు ఆధార్ నమోదు కేంద్రాల్లో నమోదు చేయడం జరుగుతుంది.

ప్రశ్న: ఇప్పటి వరకు ఆధార్ నమోదుకు అర్హులైనవారిని ఎంతమందిని గుర్తించారు?
జవాబు: 38547 మందిని గుర్తించడం జరిగింది. అందులో మొదట విడతలో చేపట్టిన నమోదు కార్యక్రమంలో 4031 మందికి నమోదు చేయడం జరిగింది. ఇంకా 34516 మందికి నమోదు చేయాల్సి ఉంది.

ప్రశ్న: వీరందరికి ఎప్పుడు చేస్తారు?
జవాబు: ఈనెల 26, 27, 28 తేదీలలో అంగన్వాడీ కేంద్రాల వద్ద శిశు ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. అందులో మిగిలిన వారికి నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: శిశు ఆధార్ నమోదులో ఆలస్యం కావడానికి గల కారణాలేంటి?
జవాబు: కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యం అవుతోంది. మరికొన్ని చోట్ల పిల్లలకు సంబంధించిన పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు కూడా అందుబాటులో లేకపోవడం తో నమోదుకు కొంత వరకు ఆలస్యం జరుగుతోంది. దీనిని అధిగమించేందుకు జిల్లా వైద్యాధికారితో మాట్లాడి వారి సిబ్బంది ద్వారా శిశువుల జనన తేదీ వివరాలను సంబం ధిత గ్రామ సచివాలయాలకు పంపించడం జరుగుతుంది. దీని ద్వారా జనన ధ్రువీకరణ పత్రాలతో ఆధార్ నమోదు చేయడం జరుగుతుంది.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి?
జవాబు: 2389 మెయిన్ సెంటర్లు ఉండగా 171 మినీ కేంద్రాలు ఉన్నాయి. దాదాపు వీటికి అందుబాటులోనే ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం.

స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నవీన్‌బాబు



రూ. కోటి విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా

7

ట్రక్కు ఢీ - భార్యాభర్త మృతి

వివరాలు....7లో

రూ.13.19 కోట్లతో వసతిగృహాలకు మరమ్మతులు

● జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జయప్రకాశ్

7

కార్పొరేషన్‌లో కుర్చీలాటపై ఉత్కంఠ

● కొత్తకొత్త ఎత్తుగడలతో పాలకవర్గం
● పట్టుకోసం టీడీపీ
● నేడు కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం
● వాడీవేడిగా జరిగే అవకాశం



కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌లో కుర్చీలాట ఉత్కంఠగా మారింది. పాలకవర్గం అభివృద్ధిని పక్కన పెట్టి వారి అక్రమాలు అవినీతి ఎక్కడ బయటపడుతాయోనని కొత్త కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఇప్పటికే ఎనిమిది మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరడంతో తమ పట్టును సాధించుకునేందుకు టీడీపీ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం జరగనున్న కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగే అవకాశం ఉంది. నవంబరు 7వ తేదీ జరిగిన సర్వసభ్య సమావేశంలో కుర్చీ కోసం కుమ్ములాట జరిగింది. కడప ఎమ్మెల్యే మాధవికి మేయర్ పక్కన సీటు వేయకుండా కింద వేయడంతో కుర్చీ ఆట మొదలైంది. ఎమ్మెల్యే అప్పటి సమావేశంలో ఏకధాటిగా మాట్లాడుతూ వైసీపీ అవినీతి అక్రమాలపై విరుచుకుపడింది. ఆమె మాటల ధాటికి తట్టుకోలేక మేయర్‌తో పాటు 49 మంది కార్పొరేటర్లు సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. అయితే పూర్తిస్థాయిలో బలమున్న వైసీపీ పాలకవర్గం బాయ్‌కాట్ చేయడం ఇదే ప్రథమమని చెప్పాలి. దీనిపై కొందరు విస్మయం వ్యక్తం చేశారు. ఇటీవల వైసీపీకి చెందిన 8 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. మరికొంత మంది కార్పొరేటర్లు కూడా చేరనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం జరిగే సమావేశం వాడీవేడిగా జరిగే అవకాశం ఉంది. అయితే వీరి కుమ్ములాటలో ప్రజల సమస్యలను గాలికి వదిలేశారని పలు పార్టీల, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార ప్రాపకం కోసం పాకులాడుతున్న వీళ్లనా.. మేము ప్రజాప్రతి నిధు లుగా ఎన్నుకున్నదంటూ ప్రజలు ఛీదరించుకుంటున్నారు.

నలిగిపోతున్న కమిషనర్

పాలకవర్గం ప్రతిపక్షం కుమ్ములాటలో కమిషనర్ పూర్తిగా నలిగిపోతున్నట్లు తెలుస్తోంది. సోమవారం జరిగే సర్వసభ్య సమావేశానికి మీడియాను అనుమతించవద్దని మేయర్ సూచించినట్లు తెలిసింది. అయితే మీడియాను అనుమతించాలని టీడీపీ వర్గీయులు పట్టుపడుతున్నారు. ఈ ఇద్దరి మధ్య ఏమి చేయాలో తెలియక కమిషనర్ సతమతమవుతున్నారు. అయితే కొంతమంది కార్పొరేటర్లు మాత్రం ప్రజా సమస్యలతో పాటు పట్టణ అభివృద్ధిపై చర్చించేందుకు సమావేశం సజావుగా జరపాలని కోరుతున్నారు.

జనం ఉన్నా.. ధనం లేకపోవడమే
అభివృద్ధికి ఆటంకం

● మంత్రి నిమ్మల రామానాయుడు
● కూటమి అధికారంలోకి రావడానికి బలిజలే కీలకం
● పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాపులు ఆర్థికంగా బాగుంటారని చాలా మంది అనుకుంటూ ఉంటారని.. ఇది కేవలం అపోహ మాత్రమేనని ఎక్కడో ఒకరిద్దరు అభివృద్ధి చెందినంత మాత్రాన కాపులు, బలిజలు అందరూ అభివృద్ధి చెందినట్లు కాదని.. జనం ఉన్నా ధనం లేకపోవడంతో అభివృద్ధి సాధించలేకపోతున్నామని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బలిజ కాపు ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని.. ఆ సామాజికవర్గానికి చెందిన అనేక మంది కౌలు రైతులు కూలీలుగా జీవనం సాగిస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతే ఈ సామాజికవర్గాలకు ప్రాధాన్యత లభించిందన్నారు. ఈ వర్గాల్లో ఆర్థిక అభివృద్ధిని బలోపేతం చేసే దానికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. యువతకు రాయితీ రుణాలు అందించి ప్రోత్సహించిందని, విద్యాభివృద్ధికి ప్రత్యేక అవకాశాలు కల్పించిందన్నారు. అయితే తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసిందన్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో రాయలసీమలో ఒకచోట కూడా బలిజలకు వైసీపీ సీటు కేటాయించలేదనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బలహీనవర్గాలను సమన్వయం చేసుకుంటూ వారికి సముచిత స్థానం కల్పించడం ద్వారా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఎందరో ప్రముఖులకు వారసులం

● మంత్రి కందుల దుర్గేశ్

చరిత్రలోని ఎందరో ప్రముఖులకు కాపు బలిజలు వారసులని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. కూటమి అధికారంలోకి రావడానికి బలిజలు ఎంతగానో శ్రమించారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో ప్రజాస్వామ్య ఖూనీ అయిందని ఆ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఎన్నికల్లో 21 ఎమ్మెల్యే స్థానాలు రెండు ఎంపీ స్థానాలను జనసేన గెలుచుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మరిన్ని స్థానాలు పెరుగుతాయన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లె సుబ్బరాయుడు మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ ఎక్కడా లేని విధంగా ఏ పార్టీలు, వర్గాలకు భయపడకుండా రాజకీయ లబ్ధి కోసం నేతల వద్ద డిమాండ్ చేయడం వల్లనే రాయలసీమేతర ప్రాంతాల్లో కాపు బలిజలు రాజకీయ పదవులు దక్కించుకున్నారన్నారు.



శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేశ్, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, నాయకులు బాలిశెట్టి హరిప్రసాద్, బట్టరుశెట్టి శ్రీనివాసులు తదితరులు

ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య మాట్లాడుతూ నిరాశ నిస్పృహ ఉన్న సమయంలో ఒక పాలెగాడు పుట్టుకొచ్చాడని.. ఇది చాలా సంతోషించదగ్గ విషయమంటూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఉద్దేశించి అన్నారు. రాజకీయాల్లో రాణించడం అంత సులభతరం కాదన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం ఎన్టీఆర్ బలిజలకు పెద్దపీట వేశారన్నారు. అయితే ఆర్థికంగా ఎదుగుదల లేకపోవడంతో కాపు, బలిజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాయలసీమకు కాపు కార్పొరేషన్ నుంచి అధిక నిధులు కేటాయిస్తే ఇక్కడి ప్రాంత యువత అభివృద్ధి సాధించగలదన్నారు.

కాపు భవనానికి స్థలం ఇవ్వండి

జిల్లా కేంద్రమైన కడపలో కాపు భవన నిర్మాణానికి పాత రిమ్స్‌లో 50 సెంట్లు స్థలం కేటాయించాలని బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.నాగరాజు కోరారు. జనసేన జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ 88 శాతం బడుగు, బలహీన వర్గాలతో పాటు బలిజలు ఉన్నారని.. అందులో 23 శాతం బలిజలు ఉన్నా అందుకు తగ్గట్టుగా రాజకీయ ప్రాధాన్యత లేదన్నారు. జనసేన రాష్ట్ర నాయకులు తాతంశెట్టి నాగేంద్ర వ్యాపారవేత్త పసుపులేటి హరిప్రసాద్, దాసరి రాము, కన్నా నాగరాజు, బీజేపీ నాయకులు చలపతి, పీవీఎస్ మూర్తి, ఎద్దుల సుబ్బరాయుడు, పెంచలయ్య ధనపాల్ జగన్, రమణ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బి.శ్రీనివాసులు, దుర్గా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్, నాగరాజు, అతికారి కృష్ణ, కీర్తన, రేకం నారాయణ, గంధం ప్రసాద్, కొవ్వూరు మస్తాన్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తాం

గండికోట ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం చెల్లింపుల విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం ఉదయం గండికోట ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం ఆయన నిర్వాసితులతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందని, దానిని ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు. గండికోట నిర్వాసితుల మౌలిక సదుపాయలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలలు, దేవాలయాలు, శ్మశానవాటికలు సమస్యలను ఆయా శాఖల అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అంతకు ముందు పర్యాటక ప్రాంతమైన గండికోటను మంత్రి నిమ్మల రామానాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు నాయకులు, రైతులు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు.






సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు.. హాజరైన జనం

భయం.. భయం..

- కనుగొండ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం
- సమీప గ్రామాల్లో తీవ్ర భయాందోళన
- అడవి వైపు వెళ్లని కాపరులు
- మరోసారి చిరుత ప్రత్యక్షం



చిరుత పులి సంచరిస్తున్న కనుగొండ అటవీప్రాంతం

ములకలచెరువు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండలం పెద్దపాళ్యం సమీపంలోని కనుగొండ రిజర్వు అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచారంతో తీవ్ర భయందోళన నెలకొంది. రెండు రోజుల కిందట అటవీ ప్రాంతంలో మేకల గుంపుపై చిరుతపులి దాడి చేయడంతో ఐదు మేకల జాడ కన్పించకపోవడం, మరో మేక మృతి చెందడం, మరొకటి తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. కాపరిపై కూడా చిరుతపులి దాడి చేసేందుకు ప్రయత్నించడం, తోడుగా ఉన్న కుక్కల సహాయంతో కాపరి పాళ్యం నరసింహులు ప్రాణాలతో బయటపడడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో కనుగొండ అటవీ ప్రాంతానికి అతి దగ్గరలో ఉన్న కొండ కింద రైల్వేగేటు వద్ద శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో వస్తున్న ఇద్దరు యువకులకు చిరుత పులి మళ్లీ కన్పించిందని గ్రామాల్లో ప్రచారం జోరుగా జరుగుతోంది. దీంతో గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారు. అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న గ్రామాల్లో తీవ్ర అలజడి నెలకొంది. కనుగొండ అటవీ ప్రాంతానికి చుట్టుపక్కల సమీపాల్లో ఉన్న తుంగపల్లె, పెద్దపాళ్యం, అంగజాలపల్లె, శివరాంపల్లె, మావిళ్లవారిపల్లె, గోళ్లపల్లె, అడివిచెరువు తదితర గ్రామాల ప్రజలకు చిరుతపులి భయం పట్టుకుంది. ముఖ్యంగా మేకల మందపై దాడి చేసిన పెద్దజారు బండ సమీపంలో ఉన్న తుంగపల్లె, పెద్దపాళ్యం గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. సాయంత్రం ఇంటి నుంచి బయటకు రావడానికి కూడా జంకుతున్నారు.



కనుగొండ అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న తుంగపల్లె గ్రామం

అటవీ శాఖాధికారులపై ఆగ్రహం

చిరుతపులి కన్పించిన రోజు నుంచి అటవీ శాఖాధికారులు వ్యవహరిస్తున్న తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిరుత పులి కన్పించిందని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇస్తే తూతూ మంత్రంగా వచ్చి విచారించి వెళ్లారని అంటున్నారు. చిరుతపులి భయం పోగొట్టేందుకు కనీసం కనుగొండ అటవీప్రాంతం సమీప గ్రామాల్లో అవగాహన కూడా కల్పించడం లేదని విమర్శిస్తున్నారు. చిరుతపులి కన్పించిన చోటికి ఇంతవరకూ వెళ్లలేదని, పెద్దపాళ్యం గ్రామంలోకి గురు, శుక్రవారం మాత్రం వచ్చి వెళ్లారని చెబుతున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖాధికారులు చిరుతపులి మేకల గుంపుపై దాడి చేసిన పెద్దజారుడుబండ వద్దకు వచ్చి పాదముద్రలు పరిశీలించి సమీప గ్రామాల్లో భయం పోగొట్టాలని పలువురు కోరుతున్నారు.

అడవి వైపు కన్నెత్తి చూడని గొర్రెలు, మేకల కాపరులు

చిరుతపులి దాడి చేసిన రోజు నుంచి గొర్రెలు, మేకల కాపరులు అడివివైపు వెళ్లడానికి భయపడుతున్నారు. అడివికి సమీపంలోని చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 60 మంది వరకు కాపరులు గొర్రెలు, మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సుమారు ఐదు వేల నుంచి ఆరు వేల వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీరందరూ అడివిని నమ్ముకుని ప్రతిరోజూ గొర్రెలు, మేకలు తోలుకెళ్లి మేపుకొచ్చేవారు. చిరుతపులి కన్పించినప్పటి నుంచి అడవిలోకి వెళ్లడానికి సాహసించడం లేదు. గ్రామాలకు చుట్టుపక్కల ఉన్న పంట పొలాల వద్దకు తోలుకెళ్లి మేపుతున్నారు. అడవిని నమ్ముకుని జీవిస్తున్న తమకు చిరుతపులి వల్ల భయం నెలకొందని, పరిస్థితి ఇలాగే ఉంటే గొర్రెలు, మేకలను అమ్ముకుని వలస వెళతామని కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రక్తం మరిగిన చిరుతపులి గ్రామాల్లోకి వస్తుందేమో..



మా గ్రామానికి దగ్గరలో ఉన్న కనుగొండ అడవిలో చిరుత పులి కన్పించింది. మేకలను చంపి తిని చిరుతపులి బాగా రక్తం మరిగింది. ఇప్పుడు గొర్రెలు, మేకలు అడవికి తోలుకెళ్లకపోవడంతో ఆహారం లేక రక్తం మరిగిన చిరుతపులి సమీప గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉంది. సాయంత్రమైతే ఇంటి నుంచి బయటకు రావడానికి భయమేస్తోంది. అటవీ శాఖాధికారులు చిరుతపులి ఎక్కడుందో కనుగొని రాత్రివేళల్లో గ్రామాల్లో గస్తీ తిరగాలి.

- మల్లెల వెంకటరమణ, తుంగపల్లె

27 మేకలను తినేసింది..



చిరుతపులి ఇప్పటివరకు 27 మేకలను తినేసింది. మేకలను మేపుకొచ్చేందుకు కనుగొండ అటవీ ప్రాంతంలోకి తోలుకెళ్లేవాడిని. దీపావళి పండగ నుంచి చిరుతపులి మేకలను పట్టుకుని వెళ్లి తినేసింది. మేకలు ఎక్కువగా ఉండడంతో గమనించుకోలేదు. మేకలు 120 ఉండేవి. ఇప్పుడు వందే ఉన్నాయి. నా కళ్ల ముందరే చిరుతపులి దాడి చేసి ఐదు మేకలను ఎత్తుకెళ్లింది. మరొకటిని చంపి ఒక మేకను గొంతు దగ్గర నోటితో పట్టుకుని గాయపరిచింది. నా పైనా కూడా దాడి చేసేందుకు వస్తుండగా నా వెంట ఉన్న కుక్కలు గట్టిగా అరవడంతో వెళ్లిపోయింది.

- పాళ్యం నరసింహులు, మేకల కాపరి

అత్తారింటి నుంచి వెళుతూ...

చెరువుకట్టపై మినీ ట్రక్కు ఢీ - భార్యాభర్తలు మృతి



నరసింహ - సుజాత మృతదేహాలు

ఓబులవారిపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అత్తారింటి నుంచి ఇంటికి వస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో కోలాటం నరసింహ(43), భార్య సుజాత(38) మృతి చెందారు. భువనగిరిపల్లె వాసులు నరసింహ దంపతులు అత్తారిళ్లు అయిన ఓబులవారిపల్లె మండలంలోని వై.కోట నుంచి స్వగ్రామం భువనగిరిపల్లెకు బైక్‌లో తిరిగి వస్తున్నారు. రెడ్డిపల్లె సమీప చెరువుకట్టపై అశోక లేలాండ్ మినీ వాహనం ఎదురుగా వచ్చి ఢీకొనడంతో నరసింహ అక్కడి కక్కడే మృతిచెందాడు. అతని భార్య సుజాత, పాప, బాబు ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలు కాగా రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో ఆమె మృతిచెందినట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం పిల్లలను తిరుపతికి తరలించారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. మృతుడు నరసింహ భువనగిరిపల్లెలో జనసేన పార్టీకి కీలక కార్యకర్తగా పనిచేస్తున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



వరుణ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

రైల్వేకోడూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. రైల్వేకోడూరులో ఆదివారం చోటు చేసుకున్న ఘటన వివరాల్లోకెళితే... రైల్వే కోడూరు మండలం రాఘవ రాజపురం దళితవాడకు చెందిన పైనం వరుణ్ (29) రైల్వేకోడూరులో చికెన్ తీసుకుని ఇంటికి వెళుతుండగా వెనక నుంచి లారీ ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న వరుణ్ బంధువులు, తల్లిదండ్రులు, స్నేహితులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వరుణ్‌కు ఏడాది కిందటే అపురూపతో వివాహమైందని తల్లిదండ్రులు సుబ్బరాయుడు, లక్ష్మీదేవి విలపించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నవీన్ బాబు తదితరులు తెలిపారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి



ఫరూక్ అహమ్మద్ మృతదేహం

లింగాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగ తెగి లారీ మీదపడడంతో విద్యుదాఘాతానికి గురై లారీడ్రైవర్ ఫరూక్ అహమ్మద్ మృతిచెందాడు. ఫరూక్ అహమ్మద్ స్వస్థలం శ్రీనగర్. అతను అరటి కాయలను లోడ్ చేసుకుని వెళ్లేందుకు ఆదివారం లింగాలకు వచ్చారు. ఫరూక్ అహమ్మద్ తన లారీని నీటితో శుభ్రంచేసుకునే సమయంలో పక్క పొలంలో మరో లారీ అరటికాయల కోసం వెళుతోంది. ఆ సమయంలో విద్యుత్ తీగలు గమనించకుండా లారీ డ్రైవర్ ముందుకు వెళ్లడంతో వైర్ లారీ క్యాబిన్‌కు తగిలి విద్యుత్ పోల్ పిన్ వద్ద బైండింగ్ వైర్ కట్ కావడంతో పైనున్న 11కేవీ విద్యుత్ లైన్‌కు తగలడం అదే సమయంలో ఫరూక్ అహమ్మద్ శుభ్రం చేసుకుంటున్న లారీమీద వైరు పడడంతో విద్యుత్ ప్రవాహం జరిగి షాక్‌కు గురై ఫరూక్ అహమ్మద్ కిందపడిపోయాడు. వెంటనే చికిత్స కోసం పులివెందులకు తరలించగా అప్పటికే అతను మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రావు వెల్లడించారు.

వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధన

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు ఆదివారం వైభవంగా మఠాధిపతి వీర శివకుమారస్వాముల ద్వారా ప్రారంభమయ్యాయి. వేకువ నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, రాత్రి కలశోత్సవం, కలశ స్థాపన, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఉదయం 5గంటలకు మఠాధిపతి, దంపతుల చేత ఈశ్వరీమాత ధార్మిక భవనం ప్రారంభోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 27 వరకు ఆరాధన గురుపూజా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారని భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పేదలకు అండగా 'లేవాకు నారపురెడ్డి ట్రస్ట్'



పేదలకు ధాన్యం పంచుతున్న లేవాకు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామరాజుపల్లె, పబ్బాపురం, రామచంద్రాపురంలో దాదాపు రెండెకరాల్లో పండించిన 80బస్తాల వరి ధాన్యాన్ని లేవాకు నారపురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ లేవాకు లక్ష్మిరెడ్డి, వైస్ ఛైర్మన్ లేవాకు నితీష్‌కుమార్‌రెడ్డి పేదలకు పంచిపెట్టారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ 2007 నుంచి తమ పొలంలో పండించిన పంటను పేదలకు పంచిపెడుతున్నట్లు చెప్పారు. నిరంతరం పేద ప్రజల కోసం లేవాకు చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తోందన్నారు. అలాగే వేసవి కాలంలో కడప వ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, ఇలా ఎన్నో సేవా కార్యక్రమాల్లో లేవాకు చారిటబబుల్ ట్రస్ట్ సేవ చేస్తూ అందరి మన్ననలు పొందతున్నామన్నారు.

మనుషుల్లో మానవత్వం వెల్లివిరియాలి : వీసీ



క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న ఇన్‌టాక్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మనుషుల్లో మానవత్వం వెల్లివిరిసినపుడే సమాజం సుఖశాంతులతో ఉండగలదని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య విశ్వనాథకుమార్ అన్నారు. ఆదివారం ఇన్‌టాక్, లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రకాష్ నగర్‌లోని జీసస్ బ్లెస్సింగ్స్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సాటి మనుషుల పట్ల ప్రేమ దయ క్షమాగుణం కలిగి ఉండాలని దైవ గ్రంథాలు ఉద్బోధిస్తున్నాయన్నారు. ఇన్‌టాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ అన్ని మతాల సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రజల మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొల్పడమే ధ్యేయమన్నారు. మన్సూర్ అలీఖాన్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ పూర్వ ప్రెసిడెంట్ పోతుల వెంకటరామిరెడ్డి, డాక్టర్ రంగనాథ్‌రెడ్డి, ఇన్‌టాక్ పూర్వ కన్వీనర్ ఇలియాస్ రెడ్డి, రాజశేఖర్ రాహుల్, గౌరీశంకర్, పాస్టర్ విజయ్‌కిషోర్ మాట్లాడారు. పాస్టర్ విజయ్‌కిషోర్ పర్యవేక్షణలో కేక్ కట్ చేసి మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీనివాసులు, కొండారెడ్డి, గంగాధర్, సంపత్‌కుమార్, వెంకటసుబ్బారెడ్డి, వేణుగోపాల్, సంజీవరెడ్డి, నాగవేణి, పార్వతి పాల్గొన్నారు.

అక్షరాల శక్తిని చాటి చెప్పిన సన్నపురెడ్డి

సాహిత్య విమర్శకులు ప్రొఫెసర్ మేడిపల్లి



సన్నపురెడ్డికి పురస్కారం అందజేస్తున్న దృశ్యం

కడప కల్చరల్, డిసెంబరు 22, (ఆంధ్రజ్యోతి): అక్షరాలకున్న శక్తిని తన సాహిత్యం ద్వారా చాటి చెప్పిన కథా, నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి అని ప్రముఖ సాహిత్య విమర్శకులు ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్ అన్నారు. కేతు పేరు మీద సన్నపురెడ్డికి అవార్డు మేలుకలయిక అన్నారు. ఇద్దరి మధ్య ఒక తరం అంతరం వున్నా అంతరాన్ని పూర్తి చేసుకుంటూ సన్నపురెడ్డి సాహిత్యం సృజిస్తున్నారన్నారు. కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీపీబ్రౌన్ గ్రంధాలయంలో కేతు స్మారక జీవన సాఫల్య పురస్కార సభ ప్రసిద్ధ కథా రచయిత దాదా హయాత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి, వారి సతీమణి దుర్గాకుమారి, డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు ద్వారా అవార్డును సన్నపురెడ్డికి అందజేశారు. ప్రధాన వక్త మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ కథ, కథనానికి మధ్య తేడా అర్థం కావాలని, అప్పుడే ఈ కాలపు కథ అర్థం అవుతుందన్నారు. నిదుర పుచ్చేది కథ అయితే జాగృతం చేసేది కథానిక అవుతుందన్నారు. అలా చూసినపుడు సన్నపురెడ్డి రాసింది కథానికలన్నారు. ప్రపంచాన్ని ప్రేమించాలంటే చాలా వదులుకోవాల్సి వుంటుందన్నారు. ముందుగా మనలో దాగివున్న కులహంకారాన్ని, మతాహంకారాన్ని వదులుకోవాలన్నారు. సన్నపురెడ్డి రాసిన చాలా కథలు అవే చెబుతాయన్నారు. ఆయన రాసిన 'చనుబాలు' కులహంకారాన్ని కూలగొట్టే కథ అన్నారు. మనిషిలోని సంఘర్షణను చిత్రించాలంటే గొప్ప మనసు కావాలన్నారు. ఆ మనసు సన్నపురెడ్డికి వుంది కాబట్టే గొప్ప సాహిత్యం రాశారన్నారు. కథానిక నిర్మించడంలో ఆయన గొప్పపనితనం చూపారన్నారు. ఒక్క పదం కానీ ఒక్క వాక్యం కూడా వృధాగా వుండదన్నారు. ఎవరి గురించి చెబుతున్నారో ఆ జీవితం పదాల్లో కనబడుతూ వుంటుందన్నారు. కథల్లో పాత్రలను ఆయన రూపకల్పన చేస్తే అది మంచి కథల కోవలోకి రాదన్నారు. కథలో మెసేజ్ పాత్రల స్వభావాల ద్వారా చెబుతారన్నారు. ఆయన కథలు చదువుతున్నట్లు కాక చూస్తున్నట్లు వుంటాయన్నారు. అలా రాయాలంటే గొప్ప పరిణితి కావాలన్నారు. పురస్కార గ్రహీత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి తన స్పందనను తెలియజేస్తూ కేతు విశ్వనాథరెడ్డితో తనకున్న సాహిత్య వ్యక్తిగత అనుబంధాన్ని పంచుకున్నారు. రాసిన కథలు, కథనాలను మెచ్చుకుని భుజం తట్టి ప్రోత్సహించడంతో తాను కథలు రాసినట్లు వెల్లడించారు. కథా రచయిత శశికళ, వైవీయూ పాలకమండలి సభ్యుడు మూల మల్లికార్జునరెడ్డి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి, అభ్యుదయ చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు చీపాటి రాజేశ్వరరావు, కేతు కుమారులు శశికాంత్, కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

బలిజ సమావేశంలో వ్యక్తికి బ్రెయిన్ స్ట్రోక్



ప్రసాద్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ యనమల సుధాకర్

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడపలో ఆదివారం నిర్వహించిన కాపు, బలిజ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. జిల్లా బలిజ సంక్షేమ సంఘం పిలుపు మేరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బలిజలు తరలివచ్చారు. సమావేశంలో మంత్రులు వేదిక మీదకు వస్తుండగా పోరుమామిళ్లకు చెందిన రాయలసేవా సమితి సభ్యుడు, జనసేన కార్యకర్త రాళ్లపల్లె ప్రసాద్ కిందపడిపోయాడు. అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అతనికి బ్రెయిన్‌స్ట్రోక్ తగిలినట్లు చెప్పారు. పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ బాధితుడిని ఆస్పత్రిలో పరామర్శించారు. రాయలసేవా సమితి సభ్యుడు, జనసేన కార్యకర్తరాళ్లపల్లె ప్రసాద్ కుటుంబం పేదరికంలో ఉండడంతో ఆ కుటుంబానికి సహాయం చేయాలంటూ పలువురిని అభ్యర్థించారు.

రూ.13.19 కోట్లతో వసతిగృహాల మరమ్మతులు

- జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జయప్రకాశ్



పీలేరులో ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జయప్రకాశ్

పీలేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని 43 ప్రభుత్వ వసతి గృహాలకు రూ.13.19 కోట్లతో మరమ్మతులు చేస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జయప్రకాశ్ తెలిపారు. పీలేరులోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో అనేక సమస్యలు ఉన్నాయని గుర్తించిన ప్రభుత్వం వాటి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులను చేపడతామన్నారు. అందులో భాగంగా జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గంలోని తొమ్మిది వసతి గృహాలకు రూ.2.40 కోట్లు, రాజంపేట నియోజకవర్గంలోని ఆరు వసతి గృహాలకు రూ.1.93 కోట్లు, రాయచోటి నియోజకవర్గంలోని 12 వసతి గృహాలకు రూ.3.02 కోట్లు, మదనపల్లె నియోజకవర్గంలోని మూడు వసతి గృహాలకు రూ.78 లక్షలు, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఒక వసతి గృహానికి రూ.10 లక్షలు, పీలేరు నియోజకవర్గంలోని 12 వసతి గృహాలకు రూ.4.97 కోట్లు మంజూరైనట్లు ఆయన వివరించారు. వసతి గృహం వంటశాల, డార్మిటరీ, మరుగుదొడ్లు, నీటి వసతిని పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్లను తొలగించిన కొత్త వాటిని నిర్మిస్తామని, ఉరుస్తున్న డార్మిటరీ పైకప్పును మారుస్తామన్నారు. త్వరలోనే ఇంజనీరింగ్ శాఖాధికారులతో మరోమారు వసతిగృహాన్ని సందర్శిస్తామన్నారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బోదేషావలి, వసతి గృహ వార్డెన్లు రమాదేవి, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

రూ. కోటి విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా

- 20 అడుగుల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు
- పనులు నిలిపివేయించిన పోలీసులు



ఆక్రమించి పనులు చేస్తున్న దృశ్యం - స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నవీన్‌బాబు

రైల్వేకోడూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీపార్యడైజ్ సినిమా హాలుకు సమీప ప్రధానదారికి పక్కనే ప్రభుత్వ స్థలాన్ని ఖద్దరు బాబుల అండతో ఆక్రమించి భవన నిర్మాణాలు చకచకా జరిగిపోతున్నాయి. నిర్మాణం జరుగుతున్న 20 అడుగుల స్థలం రూ. కోటి విలువ చేస్తుంది. ఆక్రమణదారుడు ఎవరు వచ్చినా ఏమీ చేయలేరని బహిరంగంగా నిర్మాణాల వద్దకు వచ్చిన వారిపై దౌర్జన్యం చేస్తున్నాడు. స్థానికులు నేషనల్ హైవే అథార్టీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో కొన్ని రోజుల పాటు పనులు నిలిపి వేశారు. ఖద్దరు బాబులు రంగప్రవేశం చేసి ఎవరు ఏమనుకున్నా పర్వాలేదు పనులు చేసుకోమని చెప్పడంతో ఆక్రమణదారుడు పనులు చకచకా చేపట్టాడు. ఆదివారం అందిన సమాచారం మేరకు రైల్వేకోడూరు ఎస్‌ఐ నవీన్‌బాబు తన సిబ్బందితో ఆక్రమణ నిర్మాణాలను పరిశీలించారు. వెంటనే పనులు నిలుదల చేయాలని ఆక్రమణదారుడిని హెచ్చరించారు. కోడూరులో కబ్జాల పర్వం పరిపాటిగా మారుతోంది. ఖద్దరు అండతోనే కబ్జాలు సాగుతున్నాయి. కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలను దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఎవరైనా అడ్డుకున్నా వారిపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు దృష్టికి తీసుకెళ్లగా లక్ష్మీపార్యడైజ్ సినిమా థియేటర్ వద్ద ప్రధానదారిపై నేషనల్ హైవే అథార్టీ అధికారి నారాయణ నాయక్ వచ్చి ఆక్రమణలు ఆపాలని తమకు విన్నవించారని తెలిపారు. ఆ మేరకు ఆక్రమణ నిర్మాణాలను ఆపామని తెలిపారు. మళ్లీ ఆక్రమణ పనులు జరుగుతున్నాయని సమాచారం రావడంతో తన సిబ్బంది వెళ్లి పనులు నిలుపు చేయించారని తెలిపారు. నేషనల్ హైవే అథార్టీ అధికారులు ఫిర్యాదు ఇస్తే వెంటనే కేసు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వివరించారు.

విజయదుర్గాదేవి సన్నిధిలో రాష్ట్ర మంత్రులు




మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్‌లకు విజయదుర్గ అమ్మవారి ప్రసాదాలను అందిస్తున్న దుర్గాప్రసాద్

కడప కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌లను ఆదివారం స్థానిక విజయదుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రులకు ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ సాదర స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఇంతటి గొప్ప ఆలయాన్ని ఏర్పాటు చేసి కైంకర్యాలు విజయవంతంగా నిర్వహించడం గొప్పవిషయమన్నారు. అమ్మవారిని చూస్తుంటే అలాగే చూస్తుండిపోయేలా ఉందని, విజయదుర్గమ్మ ప్రసన్న స్వరూపం చాలా ప్రశాంతతను కలిగిస్తోందన్నారు. ఆలయాన్ని నిర్మించిన దుర్గా మల్లికార్జునరావుకు ఆయన తనయుడైన దుర్గాప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ కుల జనగణన లెక్క తేల్చాలి'

కడప మారుతీనగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీ కుల జనగణన లెక్క తేల్చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు పేర్కొన్నారు. ప్రస్తుతం దేశ జనాభాలో మేమెంతో మాకంత వాటా ఇచ్చి తీరాలన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీ కుల జనగణన చేపడుతున్నామని బుకాయించిందన్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించాలన్నారు. అలాగే బీసీల అభ్యున్నతికి అడ్డుగా ఉన్న ఎకనామికల్ వీకర్ సెక్షన్‌ను తక్షణమే రద్దుపరచాలన్నారు. హాస్టళ్లలో బీసీ విద్యార్థులకు మెస్ చార్జీలు వెంటనే చెల్లించడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి తద్వారా బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. లేని పక్షంలో వచ్చే జనవరి 20న కడప కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపడతామని హెచ్చరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రామయ్య, నాయకులు పి.మల్లయ్య, నాగేంద్ర, వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, రామచంద్ర పాల్గొన్నారు.



కడప రైల్వేస్టేషన్‌లో మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన జనసేన నాయకుడు తుంగా రమణయ్య

జనవరి 22న సీతారాముల కల్యాణం

కడప కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ మైదానంలో వచ్చే జనవరి 22న సీతారాముల కల్యాణం తలపెట్టినట్లు అయోధ్య ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక రాజీవ్‌మార్గ్ సమీపంలో గల కోదండరామాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవానికి సంబంధించిన సమావేశం నిర్వహించారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

వల్లూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వల్లూరులో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఐటీడీపీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతి ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ మరోపక్క టీడీపీ సభ్యత్వ నమోదుచేస్తే ఆ కుటుంబానికి ఆసరగా టీడీపీ నుంచి కొంత నగదు వస్తుందన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

పులివెందుల టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ పేరుతో అడ్డగోలుగా రాజకీయాలు చేస్తున్న రాహుల్‌గాంధీపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో పులివెందుల పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అగౌరవపర్చడం తగదన్నారు.

తైక్వాండో శిక్షణతో ఆత్మస్థైర్యం: వైవీయూ వీసీ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జ్ఞానంతో పాటు శారీరక మానసిక వికాసం ఆత్మస్థైర్యం గల యువత తయారు కావాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ వసతి గృహాల విద్యార్థినులకు క్యాంపస్‌లో తైక్వాండో శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత విద్యార్థినులకు రెండో విడత శిక్షణను కూడా ఇవ్వనున్నామని ప్రకటించారు.

హైస్కూల్ ప్లస్‌లను జడ్పీ జూనియర్ కళాశాలలుగా మార్చాలి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హైస్కూల్ ప్లస్‌లను జడ్పీ జూనియర్ కళాశాలగా మార్పు చేయాలని ఎస్‌టీఎఫ్‌రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సుబ్బరాజు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయుడూ అంకితభావంతో పనిచేస్తూ మెరుగైన విద్యను బోధిస్తూ, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానంలో స్థిరపడే విధంగా బోధన సాగించాలన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కడప కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మృత్యుంజయేశ్వర స్వామి దేవస్థాన ఆలయ పునర్నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర దేవదాయశాఖకు చెందిన స్థపతి పరమేశ్వరప్పతో మాధవితో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి మల్లికార్జున ప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.శ్రీధర్, ప్రధాన అర్చకులు శశిధర్‌శర్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

కడప నాగరాజుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నిర్ణయించారు. ఆదివారం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రెసిడెంట్‌గా బి.బాబు మోసస్ కొత్త కమిటీ ఏర్పాటయ్యే వరకు పదవిలో కొనసాగుతారని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ప్రభాకర్, ట్రెజరర్ గుర్రప్ప, రాష్ట్ర నాయకులు రాజన్న, ఎన్.రమణయ్య, ఎం.శోభన్‌బాబు, పురుషోత్తమరావు, జయపాల్, బి.వి.వి.ఫణీంద్ర, సుబ్బరాయుడు, కొండయ్య, పవన్‌కుమార్, శవమణి, బి.సుబ్రమణ్యం, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



కడపలో సమావేశమైన ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు

కేసీ కెనాల్ బ్యాలెన్స్ అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేస్తాం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ బ్యాలెన్స్ అప్రోచ్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ సురేష్‌బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా పేర్కొన్నారు. ఆదివార కడప నగరం అయేషా స్కూల్ వెనుక ఉన్న దేవుని కడప నుంచి ఇంటర్నేషనల్ కళ్యాణ మండపం వరకు ఉన్న అప్రోచ్ రోడ్డు పనులను కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు.

బలపనూరులో ఘర్షణ-కేసు నమోదు.

సింహాద్రిపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) మండలంలోని బలపనూరు గ్రామంలో జరిగిన ఘర్షణకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు సింహాద్రిపురం ఎస్ఐ తులసీనాగప్రసాద్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు గ్రామంలో ఆదివారం స్థల విషయంలో చోటు చేసుకున్న వివాదం ఘర్షణకు దారి తీసింది. బాధితుడు వీరనారాయణ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ ఆస్తులను ప్రైవేట్ వారికి ఇస్తే ఊరుకోం

● విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ హెచ్చరిక

కడప నాగరాజుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల ఆస్తులను ప్రైవేటు వారికి ఇస్తే ఊరుకోబోమని విద్యుత్ స్ట్రగుల్ కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం కడపలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో స్ట్రగుల్ కమిటీ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సూరిబాబు ఆధ్వర్యంలో విద్యుత్ ప్రైవేటీకరణ, విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సదస్సు నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, ముజఫర్ హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్‌రంగ సంస్థలను ప్రైవేట్ వారికి అప్పగించేందుకు వేగంగా అడుగులు వేస్తోందని, ఉద్యోగులంతా ఏకమై తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. దేశంలో 85 లక్షల కోట్ల విద్యుత్ ఆస్తులు ఉన్నాయని, వాటిని ప్రైవేట్ వారికి ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా యత్నిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చండీగర్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో అక్కడి ప్రభుత్వాలు డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారని, దీంతో అక్కడి ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డుపైకి వచ్చి తీవ్ర ఆందోళన చేస్తున్నా పట్టించుకోకుండా ప్రైవేటు వారికి కారు చౌకగా అప్పగించేందుకు పూనుకున్నట్లు పేర్కొన్నారు. ఈ విధానాన్ని నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఇంజనీర్స్ అండ్ ఎంప్లాయిస్, ఎలక్ట్రిసిటీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చాయన్నారు. స్ట్రగుల్ కమిటీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, కన్వీనర్ సుబ్బిరెడ్డి, డిస్కం అధ్యక్షుడు శివశంకర్, కమిటీ నాయకులు గంగయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న స్ట్రగుల్ కమిటీ సభ్యులు

అమిత్‌షా రాజీనామా చేయాలి

కడప కలెక్టరేట్, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై రాజీనామా చేయాలని కాంగ్రెస్ కడప కో-ఆర్డినేటర్ బండి జకరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రమాణం చేసిన అమిత్‌షా, పార్లమెంట్‌లో అంబేడ్కర్ పేరు ఉచ్చరించడాన్ని కూడా సహించలేక పోవడం దారుణమన్నారు.

'తరగతులు నిర్వహించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తరగతులు నిర్వహించకుండా ఫీజులు మాత్రం వసూలు చేసుకుంటున్న ఓపెన్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏఐఎస్బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని కాగితాలపెంటలోని జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

నృత్య ప్రదర్శనలో చైతన్య విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడపలో శివసాయి గ్రూప్, వేదాస్ ఇన్‌స్టిట్యూషన్ వారు నిర్వహించిన వేదాస్ ఉత్సవం -2024-25 జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీల్లో వేంపల్లె శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. గ్రూప్ డ్యాన్స్ విభాగంలో మొదటి బహుమతి, డ్రాయింగ్ పోటీల్లో జూనియర్ విభాగంలో రెండో బహుమతి సాధించారన్నారు.



దేవుని కడప చెరువుకు బోట్లు మంజూరు చేయాలి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవుని కడప చెరువుకు నాలుగు పెడల్ బోట్లు, ఒకటి మరబోటు మంజూరు చేయాలని టీడీపీ, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం టూరిజం, కల్చర్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేవుని కడప చెరువు అభివృద్ధిలో భాగంగా మజూరు చేయాలని కోరారు. మంత్రి దుర్గేష్‌ను కలిసిన వారిలో టీడీపీ, జనసేన నాయకులు శంకర్, గోపి, బాలకృష్ణ, శంకరయ్య, రాజ తదితరులు ఉన్నారు.



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న టీడీపీ, జనసేన ప్రతినిధులు

దయగల దేవుడు యేసుక్రీస్తు

● భక్తిశ్రద్ధలతో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కమలాపురం రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దయగల దేవుడు యేసుక్రీస్తు అని, ఆయనకు పేదలపై మరింత ప్రేమగలదని దైవ సేవకులు పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని నిస్సి ప్రార్థనా మందిర ఆవరణంలో పాస్టర్ సునీల్‌దత్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు సందర్భంగా వికలాంగులచే కేక్ కట్ చేయించి అనంతరం అన్నదాన నిర్వహించారు. అదేవిధంగా సీఎస్ఐ చర్చిలో పాస్టర్ సాల్మన్ బాబు సంఘం పెద్దల ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

డాక్టరేట్ ప్రదానం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కామర్స్ విభాగ పరిశోధకుడు రాచగాళ్ల విజయరాజు యాదవ్ డాక్టరేట్ పొందారు. పెర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ ఆఫ్ సెలెక్ట్ నిఫ్టీ-50 కంపెనీస్ అంశంపై ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించా రు. కడప జిల్లా బ్ర హ్మం గారి మఠానికి చెందిన విజయరాజు యాదవ్ తన పరిశోధనాకాలంలో పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈయన రూపొందించిన ఆరు పరిశోధన వ్యాసాలు ప్ర ముఖ జర్నల్స్‌లో ప్రచురతమయ్యాయని వర్సిటీ పరీక్షల అధికారి దామ్లానాయక్ తెలిపారు.



వికలాంగులను ఆదుకోవడం అభినందనీయం


కృత్రిమ అవయవాలు అమర్చుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వికలాంగులకు కృత్రిమ అవయవాలు అమర్చి ఆదుకోవడం అభినందనీయమని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వెంకటేశ్వర్లుపేటలోని సరస్వతి విద్యామందిరం పాఠశాలలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 105 మందికి కృత్రిమ అవయవాలు అమర్చారు. ఇద్దరు పేద విద్యార్థులకు రూ.25 వేలు స్కాలర్‌షిప్‌లను, ఓ విద్యార్థికి ల్యాప్‌ట్యాప్, అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి మందుల కోసం రూ.6 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సేవాసంస్థ చైర్మన్ కళావతి, అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, డైరెక్టర్ ఎస్.శ్రీనివాసులు, శ్రీధర్, చిట్టెం రమేష్, నరసింహులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతజయంతి ఉత్సవాలు

జమ్మలమడుగు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని పాత బస్టాండులోని ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి విగ్రహం ఎదురుగా సీపీఐ నాయకులు ప్రసాద్, తదితరులు వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీపీఐ కరపత్రాలు విడుదల చేశారు. సీపీఐ శతవార్షికోత్సవం పురస్కరించుకుని 28న జరిగే బహిరంగ ప్రదర్శన సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దండు రవి, నాగేశ్వర రెడ్డి, మహబూబ్‌బాష, నరసింహులు, రఫిక్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

గండికోట నిర్వాసితులను మోసం చేసిన జగన్

● వైసీపీ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్వీర్యం ● జిల్లాలోనూ 200 చెరువులు నింపుతున్నాం

రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు


గండికోట ప్రాజెక్టుపై మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే ఆది, భూపేశ్ తదితరులు

కొండాపురం/జమ్మలమడుగు డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి.. గండికోట నిర్వాసితులకు ఐదేళ్లుగా రూ.450కోట్ల మేర పరిహారం ఇవ్వకుండా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మోసం చేశారని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. ఆదివారం గండికోట ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం నిర్వాసితులతో, మీడియాతోనూ ఆయన మాట్లాడారు. మాట తప్పడం మడమ తిప్పడం జగన్ డీఎన్‌ఏలోనే ఉందన్నారు. జగన్ లాగా కక్షలు, కార్పణ్యాలు లేకుండా తమ కూటమి ప్రభుత్వం ప్రజా పరిపాలన సాగిస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందని, దానిని ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు. గండికోట ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం చెల్లింపుల విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ జగన్ ఐదేళ్లుగా గండికోట నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఈ సందర్భంగా తమకు పరిహారం వెంటనే ఇప్పించాలని, పునరావాసకాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్వాసితులు మంత్రికి అర్జీలు ఇచ్చారు. గత ప్రభుత్వం బిల్లులు ఆపేసిన వాటిని చెల్లించాలని పలువురు కాంట్రాక్టర్లు మంత్రిని కోరారు. కార్యక్రమంలో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి, హెచ్‌ఎల్‌సీ చైర్మన్ జోగిరెడ్డి, నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాసులు, ఎస్ఈ మల్లికార్జునరెడ్డి, ఈఈ ఉమామహేశ్వర్లు, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, మండల కూటమి ఇన్‌చార్జ్ శివనారాయణరెడ్డి, తహసీల్దార్ గురప్ప, మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గండికోటను సందర్శించిన మంత్రి

జమ్మలమడుగు మండలంలోని పర్యాటక ప్రాంతమైన గండికోట గ్రామాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు పరిసర ప్రాంతాల్లోని నాయకులు, రైతులు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. గూడెం చెరువు, పొన్నతోట, నర్సీజీకొట్టాలు తదితర గ్రామాల్లో మైలవరం జలాశయం నుంచి వస్తున్న కాలువలకు నీరు పొలాల్లో చేరి రైతులు నష్టపోతున్నారన్నారు. అలాగే పెద్దముడియం మండలం కొండకల్వటాల, పాపాయపల్లె, దిగువ కల్వటాల గ్రామాలకు చెందిన రైతులు ఎస్‌ఆర్‌బీసీ పనులు పూర్తి చేయాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. అనంతరం గండికోటలోని లోయ ప్రాంతం వద్దకు చేరుకున్న మంత్రికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి లోయ ప్రాంతం గురించి అగస్త్యేశ్వరకోన, తదితర వాటికి సంబంధించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా టూరిజం లోయ పక్కన వేసిన టెంట్ల గురించి మంత్రి ఆరా తీశారు. వీటికి డబ్బులు ఎంత తీసుకుంటారని అడిగిన వెంటనే ఎమ్మెల్యే స్పందించి తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రమణారెడ్డి, గోనా పురుషోత్తంరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, బీర్రు సంతోష్, కిరణ్‌రాయల్, సర్పంచులు గురుశేఖర్‌రెడ్డి, గురుఈశ్వర్, గౌస్‌అహ్మద్, డి.షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

మాగ్రామాన్ని ముంపు కింద చేర్చండి

శెట్టివారిపల్లె గ్రామస్థుల మొర

ముద్దనూరు డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివారిపల్లె గ్రామాన్ని గండికోట బ్యాక్‌వాటర్ ముంపు కింద చేర్చి న్యాయం చేయాలని ఆ గ్రామస్థులు ఆదివారం జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు విన్నవించుకున్నారు. గండికోట ప్రాజెక్టు సందర్శనార్థం ముద్దనూరు మండలం మీదుగా గండికోట ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. మార్గమధ్యలోని శెట్టివారిపల్లె సమీపంలోని గాలేరు,నగిరి కాల్వ హెడ్ రెగ్యులేటర్ వద్ద మంత్రిని గ్రామ ప్రజలు కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ,జిల్లా అధికారులు, గ్రామస్థులు లక్ష్మీనారాయణ, చంద్ర ఓబుల్‌రెడ్డి,మురళీ తదితరులు పాల్గొన్నారు.

పండుగ సంతోషంగా నిర్వహించుకోవాలి

బద్వేలు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిస్సహాయులు, పేదలైన వృద్ధులు పండుగ సంతోషంగా నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో చిత్తా మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. పోరుమామిళ్లకు చెందిన ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహకారంతో ఆదివారం బద్వేలులోని పునీత ఆంథోని చర్చి, ఫాతిమా ఆర్‌సీఎం చర్చిల విచారణ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 310 మంది సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి చిత్తా దంపతులు క్రిస్మస్‌ను పురస్కరించుకుని వృద్ధులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. వీటిని సంస్థ ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆయా విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఎల్ ఆరోగ్యరాజ్, రెవరెండ్ ఫాదర్ చిన్నప్ప, సహాయక గురువులు, ఉపదేశులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కాశినాయన డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి):వాహన చోదకులు రోడ్డుభద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ హనుమంతు పేర్కొన్నారు. ఆదివారం ఓబుళాపురం మూడు రోడ్లకూడలిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈసందర్భంగా నిబంధనలను పాటించని,సరైన పత్రాలులేని 10 మంది వాహనదారుల నుంచి రూ.4250 అపరాధ రుసుము వసూలు చేశారు. ఈకార్యక్రమంలో పలువురు నర్సాపురం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బిజివేముల వీరారెడ్డి కాలనీకి భూమిపూజ


సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలుటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని సిద్దవటంరోడ్డు, నోబుల్ స్కూలు సమీపంలో ఆదివారం బిజివేముల వీరారెడ్డి పేరుతో బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, డాక్టర్ రవికుమార్‌రెడ్డి చేతులమీదుగా బిజివేముల వీరారెడ్డి కాలనీకి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత బొజ్జ రోశన్న, పట్టణ అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, సీనియర్ న్యాయవాది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీ : ఇద్దరికి గాయాలు

జమ్మలమడుగు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో కోవెలకుంట్ల రోడ్డులో ఆల్విన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా సెల్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వలన స్కూటర్‌కు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జమ్మలమడుగు పట్టణానికి చెందిన ముదినేని బాలయ్య అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో ఆయన దండు శాంతి, జెర్సి అనే వారిని స్కూటర్‌లో ఎక్కించుకుని చర్చికి బయల్దేరాడు. గీతాంజలి స్కూల్ వద్ద ఆల్విన్ డ్రైవర్ దాదావలి సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ లారీ డ్రైవింగ్ చేస్తూ వెళుతుండగా బైకులో వెళుతున్నవారిని లారీ ఢీకొంది. దీంతో ఆ ఇద్దరు అమ్మాయిలకు కుడికాలు, మోకాలు విరిగాయి. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా మైసూరమాంబ జాతర



బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండలంలోని కమ్మవారిపల్లె గ్రామంలో ఆదివారం మైసూర మాంబ జాతర మహోత్సవాలను గ్రామ ప్రజలు ఘనంగా చేపట్టారు. ఉదయం గ్రామంలోని ప్రజలు, మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద భక్తులు బోనాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించుకున్నామని గ్రామప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరుకు రూ.1.41 కోట్ల నిధులు

త్వరలో ఖరారు కానున్న టెండర్లు

ప్రొద్దుటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూ.1.41 కోట్లు మంజూరు చేసింది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని భవననిర్మాణం, లేఅవుట్ అనుమతులకు కడప అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ వసూళ్ళు చేసే ఫీజుల నుంచి మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు విడుదల చేశారు. ఈనిధుల ను డిసెంబరు 7న జరిగిన కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సమావేశంలో కుడా వైస్ చైర్మన్ ఈ నిధులను మంజూరు చేస్తూ ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని ఉత్తర్వులు జారీచేశారు. ఆమేరకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని గాంధీరోడ్డులో వర్షం వస్తే నీళ్ళు నిలబడి తటాకాన్ని తలపించే ప్రదేశంలో వినాయక ల్యాబ్ వద్ద ప్రొద్దుటూరు చానల్ -2కు కుసంబంధించి గాంధీరోడ్డు లోని ప్రధాన కల్వర్టును ఎత్తుపెంచి నిర్మాణం చేయడంతోపాటు ప్రొద్దుటూరు చానల్ -2ను సంబంధించి గాంధీరోడ్డునుంచి మేదర వీధివరకు కాలువకు అప్రోచ్ సీసీ రోడ్డునిర్మాణానికి రూ 40 లక్షలు కేటాయిస్తూప్రతిపాదనలు పెట్టారు. అలాగే విజయ్‌కుమార్ హాలు వెనుక గల మదూరుకాలువకు అప్రోచ్ సీసీ రోడ్డు నిర్మించి అక్కడ పార్కింగ్ సదుపాయాన్ని మెరుగుపరచడం కోసం రూ.39 లక్షలు కేటాయిస్తూ పనులకు ప్రతిపాదనలు పెట్టారు. 9 వవార్డులో సీసీడ్రైన్స్‌కోసం రూ 9 లక్షలు, 39 వవార్డు హనుమాన్ నగర్‌లో సీసీ డ్రైన్స్‌కోసం రూ. 14.70 లక్షలు,33 వవార్డులో ఎస్‌వీవీ బాలుర ప్రాథమిక పాఠశాల వద్ద దొరసానిపల్లె చానల్‌కు అప్రోచ్ సీసీ రోడ్డు కోసం రూ.16 లక్షలు, 15 వవార్డులో జీవన్ జ్యోతి స్కూలు వద్ద సీసీ రోడ్డుకోసం రూ. 9.20 లక్షలు, 15వవార్డులోని ధర్గ్ కాలనీ పార్కులో మరుగుదొడ్లనిర్మాణానికి రూ.10 లక్షలు, 12 వవార్డులో మహిళాపార్కులో అభివృద్ధి పనులకు రూ 2లక్షలు కేటాయిస్తూ ప్రతిపాదనలు కుడా వైస్ చైర్మన్‌కు పంపారు. ఆమోదం లభించగానే కుడా అధికారులు టెండర్లుపిలిచి పనులు ప్రారంభిస్తారని కమిషనర్ తెలిపారు.

వాహనాల తనిఖీ

బద్వేలుటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నాలుగురోడ్ల కూడలిలో ఆదివారం సాయంత్రం అర్బన్‌ఎస్ఐ సత్యనారాయణ వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలకు సరైన పత్రాలులేకపోవడం, ట్రిపుల్‌రైడింగ్ తదితర వాటిపై జరిమానాలు విధించారు.

తప్పిన రోడ్డు ప్రమాదం

జమ్మలమడుగు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికోట వెళ్లే దారిలో బీఆర్ కొట్టాలు సమీపాన ప్రధాన రోడ్డు మలుపు వద్ద ఆదివారం ఉదయాన్నే ఓ కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఉదయాన్నే మంత్రి నిమ్మల రామానాయుడు పోలీసు అధికారులు తదితరులు వెళ్లే సమయంలో వెనుకవైపు వెళ్లిన కారు బోల్తాపడినట్లుగా స్థానికులు తెలిపారు. అతి వేగంతో మలుపు వద్దకు రాగానే కారు బోల్తాపడి ప్రమాదం తప్పిందని తెలిపారు.